www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 10 మార్చి 2024
5
ఏలూరు



నేడు ఏజెన్సీ బంద్

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన డిఎస్‌సిలో ఏజెన్సీ ప్రాంత ఆదివాసీ గిరిజన నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందని, ఏజెన్సీ ప్రాంతంలో స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరుతూ ఈ నెల పదో తేదీన రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఏజెన్సీ బంద్‌ను పశ్చిమ ఏజెన్సీలో జయప్రదం చేయాలని గిరిజన సంఘం జిల్లా నాయకులు తెల్లం దుర్గారావు ఒక ప్రకటనలో కోరారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు 14 పోస్టులు మాత్రమే కేటాయించారని, దీనివల్ల ఏజెన్సీ ప్రాంత గిరిజన నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరగనుందని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే గిరిజనులకి జిఒ నెం.3 ప్రకారం స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులందరికీ పునరావాస ప్యాకేజీ వెంటనే ఇవ్వాలన్నారు.

'పొత్తు' ఫలించేనా..!

- టిడిపి, జనసేనలో ఆరని అసమ్మతి సెగలు
- ఎన్నికల్లో సహకరించేది లేదంటూ నాయకుల ఛీంకారాలు
- ఓట్లు బదలాయింపు జరిగేనా అంటూ తీవ్ర చర్చ
- ఉంగుటూరు, పోలవరం, తాడేపల్లిగూడెంల్లో ఇదే పరిస్థితి
- బిజెపి సీట్లు ప్రకటిస్తే మరో రచ్చ ఖాయం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లాలో టిడిపి, జనసేన పొత్తు ఫలించేనా అనే చర్చ సాగుతోంది. ఎన్నికల్లో ఓట్ల బదలాయింపు జరిగేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. టిక్కెట్ల కేటాయింపు తర్వాత టిడిపి, జనసేనలో చోటుచేసుకున్న పరిణామాలు అందుకు అద్దం పడుతున్నాయి. టిడిపి, జనసేన నాయకుల అసమ్మతి రాగాలు ఏ పరిస్థితికి దారి తీస్తాయోననే ఆందోళన ఆయా పార్టీల నాయకుల్లో వ్యక్తమవుతోంది. 2024 సాధారణ ఎన్నికల్లో టిడిపి, జనసేన పొత్తుతో ముందుకు సాగాలని ఆ పార్టీ అధినాయకులు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ నిర్ణయించారు. టిడిపి, జనసేన పొత్తును రెండు పార్టీల నాయకులు, కార్యకర్తలు స్వాగతించారు. ఇంత వరకూ బాగానే ఉన్నా టిక్కెట్ల కేటాయింపు ప్రకటన తర్వాత పరిస్థితి తారుమారైంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 14 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. టిడిపి, జనసేన అభ్యర్థుల తొలి జాబితాలో ఏడు స్థానాలను టిడిపి ప్రకటించింది. తణుకు సీటు టిడిపి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణకు కేటాయించడంతో జనసేన టిక్కెట్ ఆశించిన విడివాడ రామచంద్రరావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. తాడేపల్లిగూడెంలో జరిగిన టిడిపి, జనసేన ఉమ్మడి ఎన్నికల సభ ఏర్పాట్ల పరిశీలనకు వచ్చిన జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ బస వద్ద ఆయన తన అనుచరులతో ఆందోళనకు సైతం దిగారు. విడివాడకు అన్యాయం చేశారని, టిడిపికి సహకరించేది లేదని నాయకులు, కార్యకర్తలు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఏలూరు సీటు టిడిపి అభ్యర్థి బడేటి చంటికి కేటాయించడంతో జనసేన టిక్కెట్ ఆశించిన రెడ్డి అప్పలనాయుడు ఇదే విధమైన నిరసన తెలిపారు. వీరు ఇరువురు వచ్చే ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేసే అవకాశం ఉందని తెలుస్తోంది. దీంతో జనసేన ఓట్లు టిడిపికి బదలాయింపు జరిగేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నాయకులు ఎన్ని ఓట్లు చీల్చినా అవి పార్టీకి సంబంధించిన ఓట్లే కావడం వల్ల గెలుపోటములపై ప్రభావం చూపే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అభ్యర్థుల రెండోజాబితా ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. అయితే రెండు జిల్లాల్లో మిగిలిన ఏడు స్థానాల్లో నరసాపురం, భీమవరం, ఉంగుటూరు, తాడేపల్లిగూడెం, పోలవరం మొత్త ఐదుస్థానాలు జనసేనకు కేటాయించినట్లు స్పష్టత వచ్చింది. ఈ స్థానాల్లో టిడిపి టిక్కెట్ ఆశిస్తున్న వారితో శుక్రవారం చంద్రబాబు ఢిల్లీ నుంచి మాట్లాడి బుజ్జగించే ప్రయత్నం చేశారు. టిక్కెట్ రాకపోవడంతో ఉంగుటూరు నేత గన్ని వీరాంజనేయులు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. గత ఎన్నికల్లో ఇక జనసేన అభ్యర్థికి పదివేల పైచిలుకు ఓట్లు మాత్రమే వచ్చాయి. టిడిపి అభ్యర్థి గణనీయమైన ఓట్లు సాధించారు. టిడిపి ఓట్లన్నీ జనసేనకు బదిలీ అయితేనే జనసేన అభ్యర్థి గెలిచే అవకాశం ఉంటుంది. తీవ్ర అసంతృప్తిలో ఉన్న టిడిపి నేతలు జనసేన అభ్యర్థికి సహకరిస్తారా.. ఓట్లు బదిలీ జరిగేలా ప్రచారం నిర్వహిస్తారా అనే అనుమానాలు నెలకొన్నాయి. పోలవరం టిక్కెట్ జనసేనకు కేటాయించినట్లు స్పష్టత వచ్చింది. టిడిపి టిక్కెట్ ఆశిస్తున్న బొరగం శ్రీనివాస్ తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. శనివారం పోలవరం నియోజకవర్గ టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున బుట్టాయిగూడెంలో సమావేశమై పోలవరం టిక్కెట్ కేటాయింపుపై సరైన నిర్ణయం తీసుకోవాలని, ఐదు శాతం ఓట్లులేని జనసేనకు ఏవిధంగా కేటాయిస్తారని అంతా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీటు బొరగం శ్రీనివాస్‌కు కేటాయించకపోతే ఎన్నికల్లో సహకరించేది లేదన్నట్లు హెచ్చరికలు జారీచేశారు. దీంతో ఎన్నికల్లో పొత్తు ఫలించేనా అనే అనుమానం వ్యక్తమవుతోంది. తాడేపల్లిగూడెం టిక్కెట్ జనసేన అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్‌కు కేటాయించినట్లు స్పష్టత రావడంతో టిడిపి టిక్కెట్ ఆశించిన వలవల బాబ్జీ తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. నాయకుల మాటలను పరిశీలిస్తే ఎన్నికల్లో జనసేనకు ఇక్కడ టిడిపి నాయకుల నుంచి సహకారం ఉంటుందా అనే మీమాంస నెలకొంది. టిడిపి, బిజెపి, జనసేన పొత్తు ఖాయమవ్వడంతో బిజెపికి ఏ అసెంబ్లీ స్థానం కేటాయిస్తారా అనే చర్చ నడుస్తోంది. బిజెపికి టిక్కెట్ కేటాయింపు తర్వాత సైతం అసమ్మతి సెగలు ఇంకా పెరిగే అవకాశం ఉంది. ఇరుపార్టీల్లో అసమ్మతి నేతలను బుజ్జగించి దారిలోకి తెస్తారో.. లేక ఇబ్బందులు తప్పవో అనే చర్చ పెద్దఎత్తున సాగుతోంది.

బుట్టాయగూడెంలో జరిగిన టిడిపి పోలవరం నియోజకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న ఆ పార్టీ నేతలు

మూకుమ్మడిగా రాజీనామా చేస్తాం

జనసేనకు సీటు కేటాయింపుపై టిడిపి పోలవరం నియోజకవర్గ నేతల హెచ్చరిక

ప్రజాశక్తి - బుట్టాయగూడెం, పోలవరం

పోలవరం నియోజకవర్గంలో గత ఎన్నికల్లో 70 వేల ఓట్లు సాధించిన బొరగం శ్రీనివాస్‌కు కాకుండా 13 వేల ఓట్లు కూడా రాని జనసేనకు సీటు కేటాయించడం ఏమిటని తెలుగుతమ్ముళ్లు నిరసనకు దిగారు. బుట్టాయగూడెంలో టిడిపి నియోజకవర్గ స్థాయి అత్యవసర సమావేశం శనివారం నిర్వహించారు. పోలవరం నియోజకవర్గంలోని ఏడు మండలాల అధ్యక్షులు, నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. పోలవరం టిక్కెట్ బొరగం శ్రీనివాసుకు కేటాయిస్తే చంద్రబాబుకు పోలవరంలో గెలుపొంది బహుమతిగా ఇస్తామని తెలిపారు. జనసేనకు సీటు కేటాయిస్తే సహించేది లేదని, పార్టీ పదవులకు రాజీనామా చేస్తామని ప్రకటించారు. స్వతంత్ర అభ్యర్థిని రంగంలోకి దింపి గెలిపించి తీరతామని హెచ్చరించారు. టిడిపి రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు మీడియాతో మాట్లాడుతూ ఈ సీటు ఇంకా జనసేనకు కేటాయించలేదని, పార్టీ అధిష్టానం కార్యకర్తలను సమావేశపర్చి సందేహాలను నివృత్తి చేయాలని కోరారు. పోలవరం సీటు టిడిపికి కేటాయించకపోతే గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు టిడిపి పదవులన్నింటికీ రాజీనామా చేస్తామని తెలిపారు. టిడిపి పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొరగం శ్రీనివాస్ మాట్లాడుతూ టిడిపి అధినేత చంద్రబాబు చెప్పినట్లుగా పని చేస్తానన్నారు. నియోజకవర్గంలో గెలుపు అవకాశాలపై తెలుగుదేశం అభిమానులు, కార్యకర్తలు, నాయకుల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని అధిష్టానం నిర్ణయం తీసుకుని ఉంటే బాగుండేదన్నారు. రాజీనామాలకు సిద్ధపడిన వారిలో నేతలు మొగపర్తి సోంబాబు, అమరవరపు అశోక్, ములిశెట్టి నాగేశ్వరరావు, సుంకవల్లి సాయికృష్ణ, పారేపల్లి నరేష్, బొడ్డు కృష్ణ, శీలం వెంకటేశ్వరరావు, పారేపల్లి రామారావుఉండవల్లి సోమసుందరంతోపాటు పలువురు నాయకులు ఉన్నారు.

మండుతున్న సూరీడు..!

- ఉక్కబోతతో జనం ఉక్కిరిబిక్కిరి
- ఉపశమనాల వైపు జనం పరుగులు
- తల్లడిల్లుతున్న చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, బాలింతలు
- సాధారణం కంటే 3-4 డిగ్రీలు అధికం
- త్వరలో 40 డిగ్రీలకు చేరువయ్యే అవకాశం

పాలకోడేరులో నిర్మానుష్యంగా ఉన్న ప్రధాన రహదారి

ప్రజాశక్తి - భీమవరం

వాతావరణం వేడెక్కుతోంది. వేసవి ప్రారంభంలోనే సూరీడు ప్రతాపం చూపిస్తున్నాడు. ఎండ తీవ్రత, ఉక్కబోతతో జిల్లా ప్రజానీకం అల్లాడుతోంది. దీంతో జనం ఉపశమనం వైపు పరుగులు తీస్తున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, బాలింతలు తల్లడిల్లుతున్నారు. రోజురోజుకీ ఎండతీవ్రత పెరుగుతుండటంతో జనం బెంబేలెత్తుతున్నారు. సాధారణం కంటే 3-4 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కొద్దిరోజుల్లోనే ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరువయ్యే అవకాశాలున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించడం జనాలను ఆందోళనకు గురిచేస్తోంది.

దాదాపు 15 రోజులుగా వాతావరణం రాత్రి మంచు, పగలు వేడిమిగా ఉంది. ద్రోణి, ఉపరితల ఆవర్తనం ప్రభావంతోపాటు పొగమంచు కురవడంతో పగటి ఉష్ణోగ్రతలు పెద్దగా ఇబ్బంది పెట్టలేదు. వాస్తవానికి ఫిబ్రవరి మొదటి వారం నుంచే ఎండల ప్రభావం కన్పించింది. దాదాపు వారం రోజులపాటు పలుచోట్ల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3-5 డిగ్రీలు అధికంగా నమోదయ్యాయి. జిల్లాలో 33 నుంచి 35 డిగ్రీలకుపైగా నమోదయ్యాయి. ప్రస్తుతం ఉత్తర భారతదేశంపై వెస్టర్న్ డిస్టర్బెన్స్ (పశ్చిమ ఆటంకాల) ప్రభావం కొనసాగుతోంది. సాధారణంగా ఈ సమయంలో ఇవి ఉత్తర భారతదేశంపైనే కొనసాగుతాయి. అయితే ఇప్పుడు దక్షిణ భారతదేశంవైపు, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ వైపు కదులుతున్నాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఫలితంగా ఉదయం, రాత్రి వేళల్లో కొద్దిసేపు మేఘాలు ఆవరించి చల్లదనం ఏర్పడినా.. మధ్యాహ్నం మాత్రం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖాధికారులు చెబుతున్నారు. ఉదయం 9 గంటలకే ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటోంది. మధ్యాహ్నం సమయంలో ఎండ తీవ్రతకు జనం రోడ్లపైకి వచ్చేందుకు వెనుకాడుతున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఎండ తీవ్రతకు ఉక్కబోత తోడవ్వడంతో జనం తల్లడిల్లుతున్నారు. దీనికితోడు విద్యుత్ కోతలు అధికం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజానీకం అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. శీతల పానీయాల వైపు పరుగులు పెడుతున్నారు. ముఖ్యంగా వివిధ రకాల పండ్ల జ్యూసులతోపాటు, ఐస్‌క్రీమ్స్, కూల్‌డ్రింకులు తాగేందుకు మక్కువ చూపుతున్నారు.

గత నెలలోనే రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు

సాధారణంగా మే నెల వస్తేనేగాని ఎండల తీవ్రత అంతగా కన్పించేది కాదు. అయితే ఈ ఏడాది ఫిబ్రవరి నుంచే ఎండలు మండాయి. పసిఫిక్ మహా సముద్రంలో గతేడాది ప్రారంభమైన ఎల్‌నినో ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో గరిష్ట స్థాయికి చేరింది. దీనిని వాతావరణ నిపుణులు సూపర్ ఎల్‌నినోగా పేర్కొంటున్నారు. ఎల్‌నినో కారణంగానే 2023 అత్యంత వేడి సంవత్సరంగా నమోదైంది. ఎల్‌నినో కొనసాగుతున్నందున ఈ ఏడాది జనవరితోపాటు ఫిబ్రవరిలో కూడా రికార్డుస్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని అధికారులు చెబుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా 1991-2020 మధ్య నమోదైన ఉష్ణోగ్రతల సగటును పరిగణనలోకి తీసుకుంటే ఈ ఏడాది ఫిబ్రవరిలో 0.81 డిగ్రీల ఉష్ణోగ్రత అధికంగా నమోదైంది. దీంతో ఫిబ్రవరిలో రికార్డుస్థాయి ఉష్ణోగ్రతలు నమోదైనట్లు యూరప్‌లోని కోపర్నికస్ క్లైమేట్ చేంజ్ సర్వీస్ తెలిపింది. గతంలో 2015 చివరిలో పసిఫిక్ సముద్రంలో సూపర్ ఎల్‌నినో ఏర్పడటంతో 2016 అత్యంత వేడి సంవత్సరంగా నమోదైంది.

40 డిగ్రీలకు చేరే అవకాశం

ద్రోణి, ఉపరితల ఆవర్తనాలు బలహీన పడటంతో పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు మళ్లీ పెరుగుతున్నాయి. ప్రస్తుతం ఉష్ణోగ్రతల పెరుగుదల ప్రభావం కన్పిస్తోంది. కొన్నిచోట్ల సాధారణం కంటే 3-4 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గడిచిన 24 గంటల్లో జిల్లాలో 33 నుంచి 37 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదైంది. మరికొద్ది రోజుల్లో కొన్నిచోట్ల ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరుకునే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. మార్చి ఆరంభంలోనే ఈ పరిస్థితి తలెత్తడం అసాధారణమేనని వీరు చెబుతున్నారు. అయితే కొద్దిరోజులపాటు జిల్లాలో ఉష్ణతాపం, ఉక్కపోతతో కూడిన అసౌకర్య వాతావరణం ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్నవెంకటేష్, జెసి లావణ్యవేణి

ఎన్నికల్లో రిటర్నింగ్ అధికారుల పాత్ర కీలకం

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జెసి బి.లావణ్యవేణి

ప్రజాశక్తి - ఏలూరు

ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారుల పాత్ర చాలా కీలకమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో శనివారం ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గానికి ఆర్‌ఒ, ఎఆర్‌ఒలను నియమించినట్లు చెప్పారు. ఎన్నికల ప్రక్రియలో రిటర్నింగ్ అధికారి పాత్ర అత్యంత కీలకమన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి ఫలితాలు ప్రకటించే వరకూ రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి, అభ్యర్థుల ఖర్చు, నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, తిరస్కరణ, ఉపసంహరణ, పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా ప్రచురణ, బ్యాలెట్ పేపర్ల తయారీ, కౌంటింగ్ వంటి కీలకమైన బాధ్యతలు రిటర్నింగ్ అధికారులపై ఉంటాయన్నారు. రిటర్నింగ్ అధికారులకు ఎన్నికల కమిషన్ అందజేసిన 'హ్యాండ్‌బుక్'లోని ప్రతి ఛాప్టర్‌ను క్షుణ్ణంగా చదవాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా పాటించాలన్నారు. షెడ్యూల్ విడుదలైన మరుక్షణం ఆయా కార్యాలయాల్లో ప్రజాప్రతినిధుల చిత్రపటాలు, ముఖ్యమంత్రి తదితరులతో ప్రచురితమైన వాల్ పోస్టర్లను తాత్కాలికంగా తొలగించాలన్నారు. మరణించిన ప్రముఖ నాయకుల విగ్రహాలకు ముసుగు వేయనవసరం లేదని స్పష్టం చేశారు. జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి మాట్లాడుతూ నామినేషన్ ప్రక్రియలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించి, చెక్‌లిస్ట్ ప్రకారం పరిశీలన చేయాలన్నారు. ఎన్నికల కమిషన్ జారీ చేసే ప్రతి సర్క్యులర్, మార్గదర్శకాలను క్షుణ్ణంగా పరిశీలించి, దానికి అనుగుణంగా వ్యవహరించాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే అంశాలను పరిశీలించేందుకు ఆయా నియోజకవర్గాల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇవిఎంల నిర్వహణ, ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు, ఫలితాల ప్రకటన, సి-విజిల్ యాప్ తదితర అంశాలపై ఆర్‌ఒలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. రిసోర్స్‌పర్సన్స్‌గా వ్యవహరించిన డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ ఆర్.విజయరాజు నామినేషన్ ప్రక్రియపై, ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలి, సర్వశిక్షా అభియాన్ ఎపిసి బి.సోమశేఖర్ ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి కుముదినిసింగ్, రిటైర్డ్ రెవెన్యూ అధికారి చక్రపాణి పోస్టల్ బ్యాలెట్‌పై, ఇవిఎ, ఐ.టి. అప్లికేషన్స్‌పై జెడ్‌పి సిఇఒ కె.సుబ్బారావు, ఎన్ఐసి.శర్మ వివరించారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ డి.పుష్పమణి, ఐటిడిఎ పిఒ ఎం.సూర్యతేజ, రిటర్నింగ్ అధికారులు భవాని శంకరి, కె.అద్దయ్య, ఎన్ఎస్‌కె.ఖాజావలి, ముక్కంటి, భాస్కర్, కలెక్టరేట్ ఎఒ కె.కాశీవిశ్వేశ్వరరావు, ఎపిఐసిసి జెడ్ఎంకె.బాబ్జీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇవిఎంల వినియోగంపై అవగాహన కల్పించారు.

ఏలూరులో సిఐటియు నిర్వహించిన సెమినార్‌లో మాట్లాడుతున్న ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు, వ్యకాస రాష్ట్ర మాజీ నేత మంతెన సీతారాం, హాజరైన కార్మిక నేతలు (వార్త మెయిన్ ఎడిషన్‌లో)

ప్రజాస్వామ్య హక్కులను హరిస్తున్న ప్రభుత్వం

ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్


శ్రీనివాస్‌కు నోటీసు ఇస్తున్న పోలీస్


లింగరాజుకు నోటీసు ఇస్తున్న పోలీస్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాస్వామ్య హక్కులను హరిస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. రైల్‌రోకో, రైల్వే స్టేషన్ల ఎదుట కార్యక్రమాలకు ప్రభుత్వం నుంచి అనుమతులు లేవని, కార్యక్రమంలో పాల్గొంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని టూ టౌన్ పోలీసులు నోటీసు ఇవ్వడం ప్రజాస్వామ్య హక్కులను హరించి వేయడమేనని ఆయన తీవ్రంగా విమర్శించారు. రైల్ రోకో, రైల్వే స్టేషన్ ఎదుట ఎటువంటి ఆందోళన కార్యక్రమాలకు తాము పిలుపు ఇవ్వకపోయినా ఎవరో ఇచ్చిన పిలుపునకు నోటీసులు ఇచ్చి ఆందోళనకు గురి చేయడం అన్యాయమన్నారు. శనివారం టూ టౌన్ పోలీసు వారి నుంచి నోటీసు తీసుకున్న అనంతరం ఆయన ఏలూరు అన్నే భవనంలో మీడియాతో మాట్లాడారు. తనతో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతు సంఘం, కౌలు రైతు సంఘం నాయకులకు, కార్యకర్తలకు పోలీసులు ముందస్తు నోటీసుల ఇచ్చారన్నారు. ముందస్తు నోటీసుల పేరుతో పోలీసులు హడావుడి చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. నూజివీడు మండలంలోని గొల్లపల్లిలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నరసింహ, పెదపాడు మండలంలోని రాజుపేటలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు గుండపనేని సురేష్, మరికొంతమంది నాయకులకు పోలీసులు ముందస్తు నోటీసులు ఇచ్చారని తెలిపారు. పిలుపు ఇవ్వని కార్యక్రమానికి నోటీసులు ఏంటని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా రైతు ఉద్యమాన్ని అణిచి వేయాలని నిరంకుశ నియంతృత్వ చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పోలీసులతో నిర్బంధ చర్యలకు పూనుకుంటుందన్నారు. ఇదేనా రైతులకు చేసే మేలు అని ప్రశ్నించారు. పోలీసు నిర్బంధాలతో రైతు ఉద్యమం ఆగదని, మరింత ఉధృతం అవుతుందని హెచ్చరించారు. ఆందోళనకు ఎవరు పిలుపునిచ్చారో తెలుసుకోకుండా ఎవరు ఆందోళనకు పిలిపించినా తమకు నోటీసులు ఇచ్చి ఇబ్బందులకు గురి చేయడం పోలీసులకు తగదన్నారు. ఉద్యమాలపై నిర్బంధ చర్యలు మానుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య హక్కులను కాపాడాలని కోరారు.

అక్రమ అరెస్టులు, గృహ నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరు

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దేగా ప్రభాకర్

అక్రమ అరెస్టులు, గృహనిర్బంధాలతో ఉద్యమాలు ఆపలేరని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దేగా ప్రభాకర్ అన్నారు. తనకు సంబంధం లేదని చెబుతున్నప్పటికీ ఈ నెల పదో తేదీన రైల్ రోకో కార్యక్రమంలో పాల్గొనకూడదంటూ మూడో పట్టణ పోలీసులు నోటీసు ఇచ్చి, తనను గృహనిర్బంధం చేయడం పట్ల ఆయన పోలీసుల ప్రవర్తన తీరును తీవ్రంగా ఖండించారు. శనివారం దేగా ప్రభాకర్ గృహానికి వెళ్లి నోటీసులు అందించి హౌస్ అరెస్టు చేస్తున్నట్లు తెలపడంతో ప్రభుత్వ నిర్బంధం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను పదో తేదీన ఎటువంటి కార్యక్రమాల్లో పాల్గొనడం లేదని చెప్పినా వినకుండా పోలీసులు ప్రవర్తించిన తీరు పట్ల అభ్యంతరం తెలిపారు. అక్రమ అరెస్టులు, గృహనిర్బంధాలతో ఉద్యమాలు ఆపలేరని, భవిష్యత్తులో ప్రజలు ఈ చేతకాని, అసమర్ధ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

భీమడోలు : రైతులు పండించే పంటలకు మద్దతు ధర కల్పించాలని పదో తేదీన రైల్ రోకోలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో భీమడోలు పోలీసులు సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజుకు నోటీసు ఇచ్చారు. పూళ్ల గ్రామంలో కౌలు రైతుల సంఘం జిల్లా కో-కన్వీనర్ శ్రీరామచంద్రమూర్తికి పోలీసులు నోటీస్ ఇచ్చారు.

టిడిపి నేత పాలి ప్రసాద్ మృతి

పలువురి సంతాపం


పాలి ప్రసాద్ (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

టిడిపి జిల్లా కార్యాలయ కార్యదర్శి పాలి సత్యనారాయణవరప్రసాద్(71) అనారోగ్య కారణాలతో శనివారం సాయంత్రం ఐదు గంటలకు మృతి చెందారు. పాలి ప్రసాద్‌గా సుపరిచితులైన ఆయన 40 ఏళ్లుగా టిడిపికి ఎనలేని సేవలందించారు. కీర్తిశేషులు ఎన్‌టి.రామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించిన నాటి నుంచి పార్టీలో చేరిన ఆయన ఎన్‌టి.రామారావుకు నమ్మిన బంటుగా ఉంటూ ఎంతమందిలో ఉన్నా ప్రసాద్ అని పేరు పెట్టి పిలిచే స్థాయి గుర్తింపు తెచ్చుకున్నారు. 1984లో ఎన్‌టి.రామారావు ప్రభుత్వంలో పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ ఛైర్మన్‌గా పని చేసిన ఆయన అనంతరం టిడిపి జిల్లా కార్యాలయ కార్యదర్శిగా పనిచేస్తూ వచ్చారు. 2014లో నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రెండేళ్లు రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ ఛైర్మన్‌గా పని చేశారు. రెండేళ్ల క్రితం ఆయన భార్య నిర్మలకుమారి అనారోగ్య కారణాలతో మృతి చెందారు. వారికి పిల్లలు లేకపోవడంతో ఒక బాలికను పెంచుకుంటున్నారు. ప్రస్తుతం ఆ బాలిక ఇంటర్మీడియట్ చదువుతుంది. గత ఫిబ్రవరి 28వ తేదీన తాడేపల్లిగూడెంలో జరిగిన జనసేన, తెలుగుదేశం పార్టీ ఉమ్మడి జెండా సభకు వెళ్లిన ఆయనను ప్రత్తిపాడు వద్ద వాహనం ఢీ కొనడంతో తుంటి ఎముక విరిగింది. దీంతో వారం రోజుల క్రితం ఆయనకు ఏలూరులోని మహాలక్ష్మి ఆసుపత్రిలో ఆపరేషన్ చేసి చికిత్స అందిస్తున్నారు. శనివారం సాయంత్రం ఐదు గంటల సమయంలో ఆయన ఆరోగ్యం విషమించటంతో మృతి చెందారు. పాలి ప్రసాద్ మృతి పట్ల టిడిపి జిల్లా నాయకులు గన్ని వీరాంజనేయులు, బడేటి చంటి, చింతమనేని ప్రభాకర్‌తో పాటు పలువురు నాయకులు తమ సంతాపాన్ని తెలిపారు.

నూజివీడు ఎఎంసి ఛైర్‌పర్సన్‌గా కృష్ణవేణి

పలువురి అభినందనలు

ఎంఎల్‌ఎకు కృతజ్ఞతలు తెలుపుతున్న కృష్ణవేణి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని ప్రభుత్వం నియమించింది. ఛైర్‌పర్సన్‌గా కంభాల కృష్ణవేణి, వైస్ ఛైర్మన్‌గా బర్మా సీతారామయ్యతో పాటు మరో 17 మంది సభ్యులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎంఎల్‌ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు. తనను వైస్ ఛైర్మన్‌గా నియమించినందుకు కృష్ణవేణి ఎంఎల్‌ఎ మేకా వెంకటప్రతాప్‌అప్పారావును శనివారం మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. నూతన వైస్ ఛైర్మన్ కృష్ణవేణికి ఎఎంసి అధికారులు, సిబ్బంది స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ముసునూరు జెడ్‌పిటిసి సభ్యులు వరికూటి ప్రతాప్, వైసిపి మండలాధ్యక్షుడు మూల్పురి నాగమల్లేశ్వరరావు, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

కెజిబివిలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - కుక్కునూరు

మండలంలోని కుక్కునూరు, వేలేరు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో 2024- 2025 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు రెండు పాఠశాలల స్పెషల్ ఆఫీసర్లు తెలిపారు. 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కుక్కునూరు కెజిబివిలో ఆరో తరగతిలో 40, 8వ తరగతిలో ఒకటి, తొమ్మిదో తరగతిలో ఒకటి, ఇంటర్ ఫస్ట్‌ఇయర్ (బైపిసి)లో 40 ఖాళీలు ఉన్నాయని తెలిపారు. వేలేరు కెజిబివిలో ఆరో తరగతిలో 40, ఎనిమిదో తరగతిలో రెండు, పదో తరగతిలో రెండు, ఇంటర్ ఫస్ట్ ఇయర్ (ఎంపిసి)లో 40 ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఈ నెల 12వ తేదీ నుంచి ఏప్రిల్ 11వ తేదీలోగా ఆసక్తి కల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అనాథలు, బడి బయట ఉన్న పిల్లలు (బడి మానేసినవారు) ఎస్‌టి, బిసి, మైనారిటీ, దారిద్ర్య రేఖకు దిగువన (బిపిఎల్) జీవిస్తున్న బాలికలు మాత్రమే ప్రవేశాలకు అర్హులని తెలిపారు. https://apkgbv.apcfss.in వెబ్‌సైట్‌లో విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఎంపికైన వారి ఫోన్ నెంబర్లకు మెసేజ్ రూపంలో సమాచారం ఇస్తామన్నారు. ప్రవేశానికి దరఖాస్తు చేసుకునే విద్యార్థిని కుటుంబాల ఆదాయ పరిమితి గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.40 లక్షల లోపు ఉండాలని తెలిపారు.

కొయ్యలగూడెంలో అల్లూరి విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

విగ్రహాన్ని ఆవిష్కరించిన వక్తలు

మండల కేంద్రమైన కొయ్యలగూడెంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని శనివారం ఆవిష్కరించారు. అప్‌ల్యాండ్ క్షత్రియ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు నడింపల్లి సత్యనారాయణరాజు చేతుల మీదుగా విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలడించిన ధీరుడు, మహోన్నత వ్యక్తి అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. అల్లూరి ఆశయ సాధనలో అందరూ నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, అల్లూరి అభిమానులు పాల్గొన్నారు.

14న చలో ఢిల్లీ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - చింతలపూడి

సంయుక్త కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా ఈ నెల 14వ తేదీన నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమానికి రైతులు, కౌలు రైతులు, రైతు కూలీలు తరలి రావాలని ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి దొంత కృష్ణ పిలుపునిచ్చారు. మండలంలోని పోతునూరులో శనివారం నిర్వహించిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మద్దతు ధరలకు చట్టబద్ధత చట్టం చేస్తామని, వ్యవసాయ చట్టాలను రద్దు చేస్తామని లిఖితపూర్వకంగా గత రైతు ఉద్యమ విరమణ సందర్భంగా ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 14వ తేదీ చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయడం కోసం ఈ నెల 9వ తేదీ నుంచి 12వ తేదీ వరకు గ్రామాల్లో రైతులను సమీకరిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో రైతు సంఘం చింతలపూడి మండలాధ్యక్షులు ఎస్‌కె కాలేశా, కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి రావెళ్ల రాజా, కౌలు రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు తక్కలపాటి ప్రసాదరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఎ అబ్బయ్యచౌదరి

పలు అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఏలూరు రూరల్ మండలంలోని మొండికోడు, చాటపర్రు గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను దెందులూరు ఎంఎల్ఎ కొఠారు అబ్బయ్య చౌదరి శనివారం ప్రారంభించారు. మొండికోడులో రూ.5 లక్షలతో నిర్మించిన అంగన్వాడీ ప్రహరి గోడను ఏలూరు ఎంపిపి పి.శ్రీనివాసరాజుతో కలిసి ప్రారంభించారు. రూ.5.40 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన పైపులైన్‌ను ప్రారంభించారు. రూ.14 లక్షల వ్యయంతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం నూతన భవనాన్ని, రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. రూ.ఏడు లక్షలతో నిర్మించిన మల్టీ పర్పస్ షెడ్డును ప్రారంభించారు. అనంతరం మొండికోడు గ్రామంలో నిర్వహించిన వైఎస్ఆర్ చేయూత కార్యక్రమంలో ఎంఎల్ఎ పాల్గొన్నారు. మండలానికి సంబంధించి 2727 మంది మహిళలకు వైఎస్ఆర్ చేయూత నాలుగో విడత కింద రూ.5,11,31,250 చెక్కును అందించారు. అనంతరం ఎంఎల్ఎ గ్రామ దేవత సంతోషి మాత అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం చాటపర్రులో సీసీ రోడ్డును ప్రారంభించారు.

గోపాలపురం నుంచి పోటీ చేస్తా

న్యాయవాది బాతుల వేణు

ప్రజాశక్తి - కామవరపుకోట

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గోపాలపురం నియోజకవర్గం నుంచి తాను పోటీ చేస్తున్నట్లు ఆలిండియా ఫార్వార్డ్ బ్లాక్ పార్టీ జిల్లా అధ్యక్షులు, న్యాయవాది బాతుల వేణు తెలిపారు. మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో శనివారం పర్యటించిన ఆయన ఈ విషయం తెలిపారు. రానున్న 2024 ఎన్నికల్లో జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో తమ పార్టీ పోటీ చేస్తుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు విజయ్‌కు మాతృవియోగం

ప్రజాశక్తి - మండవల్లి

టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చాబెత్తిన విజయ్‌కి మాతృవియోగం కలిగింది. విజయ్ తల్లి చాపత్తిన సుశీల(80) మండవల్లిలోని ఆయన నివాసంలో శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. విషయం తెలుసుకున్న అంబేద్కర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు సుశీల మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సుశీల మృతి బాధాకరమన్నారు. సుశీల మృతదేహాన్ని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్.భాస్కరరావు, అసోసియేషన్ అధ్యక్షులు కొరపాటి శాంతరాజు, కార్యదర్శి కొండపల్లి రవి వరప్రసాద్, ట్రెజరర్ దాకారపు వినోద్, ఉపాధ్యక్షులు బేతపూడి తంబి, సురేష్ మహారాజ్ సందర్శించారు.

నేరాలు - ఘోరాలు

పనికి వెళ్లలేదని యువతిపై దాడి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పట్టణంలోని రామాయమారావుపేటకు చెందిన యువతి బొడ్డు చంద్ర తల్లిదండ్రులు తన చిన్నతనంలో మృతి చెందారు. ఈ క్రమంలో చంద్ర తన పెదనాన్న, పెద్దమ్మల వద్ద ఉంటుంది. ఆమె పెదనాన్న, పెద్దమ్మలకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ క్రమంలో శనివారం తాను పనికి వెళ్లలేదని తన సోదరులు, సోదరిలు నలుగురు కలిసి తనపై కర్రలతో దాడి చేసి కొట్టారని బాధితురాలు చంద్ర వాపోయింది. ఈ దాడిలో గాయాలపాలైన చంద్ర నూజివీడు ఏరియా ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

సమాజంలో మహిళల పాత్ర కీలకం

చింతలపూడి : మాట్లాడుతున్న అడబాల లక్ష్మి

ప్రజాశక్తి - చింతలపూడి

కుటుంబం, సమాజంలో మహిళల పాత్ర కీలకమని మహిళా సాధికారత లేకపోతే దేశం అభివృద్ధిలో ముందుకు వెళ్లలేదని విశ్రాంత జడ్జి అడబాల లక్ష్మి అన్నారు. మండలంలోని ఎర్రగుంటపల్లిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను రాధా గార్డెన్స్‌లో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ, ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) మండల శాఖల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విశ్రాంత జడ్జి అడబాల లక్ష్మి మాట్లాడుతూ కుటుంబం, సమాజంలో మహిళల పాత్ర కీలకమన్నారు. మరో ముఖ్య అతిథి మహిళా సమైక్య జాతీయ నాయకురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ మహిళల అణచివేతను ప్రతిఘటిస్తూ స్వేచ్ఛ స్వతంత్రాలు సమానత్వ సాధన దిశగా శ్రమకు తగిన వేతనం, నిర్ణీత పని గంటలకు శ్రామిక మహిళలు సాగించిన మహత్తర ఉద్యమ పోరాటాల ఫలితమే మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం అని అన్నారు. రిటైర్డ్ పీడీ కె.నాగమణి అధ్యక్షత వహించగా గైనాకాలజిస్ట్ డాక్టర్ ఆర్.భవ్య, ఆర్థోపెటిక్ డాక్టర్ జి. దీప్తి, సిడిపిఒ పి.మాధవి, ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మన్నవ యామిని, జిల్లా అధ్యక్షులు వరక శ్యామల మాట్లాడారు. తొలుత మహిళా సమాఖ్య జెండాను అడబాల లక్ష్మి, అక్కినేని వనజ ఆవిష్కరించారు. అనంతరం ముఖ్య అతిథిగా విచ్చేసిన అతిథులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మానవత మండలాధ్యక్షులు పుల్లూరి సోమశేఖర్, డాక్టర్ అన్నవరపు సత్యనారాయణ, అప్పారావు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య నాయకురాలు జి.అంజమ్మ, ఆర్.మరియమ్మ పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : సింహాద్రిఅప్పారావుపేటలో ర్యాలీ

ఆగిరిపల్లి :మహిళలు అన్ని రంగాలల్లో తమ ప్రతిభా, పాటవాలను ప్రదర్శించడం వల్ల మహిళా శక్తిని ప్రపంచానికి చాటాలని స్ఫూర్తి మహిళా పరస్పర సహాయ సహకార సంఘం ఇన్‌ఛార్జి సిస్టర్ ఇందిర అన్నారు. మండల పరిధిలోని సింహాద్రి అప్పారావుపేట గ్రామంలో స్ఫూర్తి మహిళా సంఘం ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎస్ఎ పేట పురవీధులల్లో ర్యాలీ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యురాలు కె.నిర్మలకుమారి, పిన్నమరెడ్డిపల్లి సర్పంచి జాలా భూషణం, ఎం.సత్యశ్రీ, ఎస్‌వి.లక్ష్మి, సిస్టర్స్ రమ్య, సోఫియా, విమల, సెల్వి, మహిళలు పాల్గొన్నారు.

మొరాయించిన ఆర్‌టిసి బస్సు

మధ్యలో ఆగిపోయిన వైనం
ప్రయాణికులు, చిన్నారుల ఇబ్బందులు


మరమ్మతులకు గురైన ఆర్‌టిసి బస్సు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

మండలంలోని పుట్లగట్లగూడెంలో ఆర్‌టిసి బస్సు మరమ్మతులకు గురై ఆగిపోయింది. బస్సులో ప్రయాణికులు, చిన్నారులు పలు ఇబ్బందులకు గురయ్యారు. జంగారెడ్డిగూడెం నుంచి ఏలూరు వెళ్తున్న ఆర్‌టిసి బస్సు పుట్లగట్లగూడెం సమీపంలోకి వచ్చేసరికి క్లచ్ ప్లేట్లు పోయి ఆగిపోయింది. దీంతో బస్సులో ప్రయాణికులు, చిన్నారులు ఇబ్బందులకు గురయ్యారు. ఆర్‌టిసి సిబ్బంది సకాలంలో వేరే బస్సు ఏర్పాటు చేయలేదని వారు వాపోయారు. జంగారెడ్డిగూడెం డిపో బస్సు తరచూ మరమ్మతులకు గురవుతుందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డుపై ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులు

ప్రశాంతంగా ఇంటర్ పరీక్ష

ప్రజాశక్తి - కలిదిండి

ఇంటర్ ప్రథమ సంవత్సర మ్యాథ్స్-1బి, హిస్టరీ, జువాలజీ పరీక్షకు ఏడుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎగ్జామినేషన్ చీఫ్ సుపరింటెండెంట్ నంబూరి గోపాలకృష్ణంరాజు తెలిపారు. మండలంలోని కోరుకొల్లు, కలిదిండి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన పరీక్షకు 65 మంది విద్యార్థులకు 58 మంది హాజరయ్యారని గోపాల కృష్ణంరాజు తెలిపారు.

సొసైటీ ప్రహరీ, అప్రోచ్ రోడ్డు ప్రారంభం

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లిలో రూ.11 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన సొసైటీ (పిఎసిఎస్) అప్రోచ్ రోడ్, ప్రహరీని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు, ఎంఎల్‌సి జయ మంగళ వెంకటరమణ, వైసిపి ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి కె.సునీల్‌కుమార్‌యాదవ్ శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, ఎఎం సి ఛైర్మన్ కొల్లాటి సత్యనారాయణ, ఎఎంసి మాజీ ఛైర్మన్ పాము రవికుమార్, పిఎసిఎస్ అధ్యక్షురాలు మన్నెం రమా దేవి, సొసైటీ సిఇఒ ఎ.దుర్గారావు, మండల కో ఆప్షన్ సభ్యు లు షేక్ అల్లాబక్షు, కొల్లి నాని, పగడాల సాయిరాం పాల్గొన్నారు.

'జనసైనికులు ఘర్షణలకు దిగడం సరికాదు'

ప్రజాశక్తి - కామవరపుకోట

కామవరపుకోట గ్రామ పంచాయతీలో వార్డు మెంబర్లను గెలిపించుకునే బలం కూడా చింతలపూడి మాజీ ఎంఎల్ఎ మురళీరామకృష్ణకు లేదని వీరిశెట్టిగూడెం సర్పంచి దేవరపల్లి రామ్మోహన్‌రావు అన్నారు. మండలంలోని వీరిశెట్టిగూడెం గ్రామ సచివాలయంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని, వాటిని నిరూపించాలని సివాల్ చేశారు. జెడ్‌పిటిసి సభ్యులు కడిమి రమేష్ మాట్లాడుతూ గ్రామంలో సచివాలయం వద్ద ముందుగా వైసిపి జెండా ఏర్పాటు చేశామని, ఆ జెండా పక్కనే జనసేన పార్టీ జెండా పెట్టడం, ఘర్షణకు దిగడం, అవాస్తవలు చెప్పడం సరికాదన్నారు. ఏదైనా సమస్య ఉంటే సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి ఎఎంసి మాజీ ఛైర్మన్ అశోక్‌బాబు, గుర్రాల జీవన్, పితాని గణపతి, భారతాల యుగంధర్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

వైసిపి విజయానికి కృషి చేయాలి

ఎంఎల్ఎ వాసుబాబు

ప్రజాశక్తి - ఉంగుటూరు

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ గ్రామ పార్టీ కార్యకర్తలు ఐక్యతతో పార్టీ విజయానికి కృషి చేయాలని ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు అన్నారు. శనివారం సాయంత్రం నారాయణపురం గ్రామ కమిటీ కార్యకర్తలతో ఆత్మీయ సమావేశాన్ని చేబ్రోలులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయ్యేలా విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మంగారావు, బల్ల త్రిమూర్తులు, పైడి అరుణ్‌కుమార్, ఎంపిటిసి సభ్యులు మహాలక్ష్మి, బండారు నాగరాజు, ఉప సర్పంచి సాంబ పాల్గొన్నారు.

'గెలుపే లక్ష్యంగా పని చేయాలి'

ప్రజాశక్తి - కామవరపుకోట

వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని వైసిపి చింతలపూడి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంభం విజయరాజు అన్నారు. మండలంలోని వైసిపి కార్యాలయం వద్ద బూత్ కమిటీల సమావేశం, మేము సిద్ధం-మా బూత్ సిద్ధం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలన్నారు. ప్రతిఒక్కరూ వైసిపి గెలుపుకోసం సైనికుడిగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు కడిమి రమేష్, చింతలపూడి ఎఎంసి మాజీ ఛైర్మన్ అశోక్‌బాబు పాల్గొన్నారు.

'పల్లెల్లో అభివృద్ధి శూన్యం'

ప్రజాశక్తి - ఉంగుటూరు

వైసిపి హయాంలో పల్లెల్లో అభివృద్ధి కరువైందని జనసేన పార్టీ ఉంగుటూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పత్సమట్ల ధర్మరాజు అన్నారు. మండలంలోని చిన్నవెల్లమిల్లి, చింతయగూడెం గ్రామాల్లో శనివారం జనంలోకి జనసేన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక జనసేన నాయకులతో కలిసి గ్రామంలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధర్మరాజు మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వ పాలనలో గ్రామీణ ప్రాంతాల్లో నలుసంత అభివృద్ధి కూడా జరగలేదన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. టిడిపి, జనసేన ఉమ్మడి ప్రభుత్వం రాగానే స్థానిక సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

పట్టిసీమకు తగ్గిన యాత్రికుల తాకిడి

ప్రజాశక్తి - పోలవరం

మహాశివరాత్రిని పురస్కరించుకుని పట్టిసీమ భద్రకాళి సమేత వీర స్వామిని శనివారం సుమారు నాలుగు వేల మంది భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరిం చినట్లు ఆలయ కార్యదర్శి సంగమేశ్వరశర్మ తెలిపారు. పట్టిసీ మ మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా ఇసుక తిన్నెల్లో వేసిన దుకాణాల సముదాయాలు యాత్రికుల రాకపోకలు తగ్గి వెలవెలబోయాయి. రాకపోకల కోసం ఏర్పాటుచేసిన పంట్లు వంతెనపై రాకపోకలు పూర్తిస్థాయిలో తగ్గిపో యా యి. దుకాణాల సముదాయాల వ్యాపారులు, భక్తులు నడక ప్రయాస బాధ తాళలేక పడవలను, లాంచీలని ఆశ్రయించారు.

ఉత్సవాల ఆదాయం 27.86 లక్షలు

పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవాల ఆదాయం రూ.27,86,942 వచ్చినట్లు పట్టిసీమ భద్రకాళి సమేత వీరేశ్వర స్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.సంగమేశ్వర శర్మ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అంతరాలయ దర్శనం ద్వారా రూ.4.86 లక్షలు, శీఘ్ర దర్శనం ద్వారా రూ.3,90,700, ప్రత్యేక దర్శనం ద్వారా రూ.2,62,820, కేశఖండనం ద్వారా రూ.1,100, హుండీల ద్వారా రూ.12,48,252, కొబ్బరి చెక్కల ద్వారా రూ.1,17,900, తలనీలాల ద్వారా రూ.6600, అన్నదాన విరాళాల ద్వారా రూ.2,73,570 వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది వెంకటరాజు పాల్గొన్నట్లు తెలిపారు.

ఘనంగా గ్రామోత్సవం

ముసునూరు :మండలంలోని బలివే శ్రీరామలింగేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవం వేడుకల్లో భాగంగా మూడో రోజు శనివారం తెల్లవారు జామునుంచే భక్తులు క్యూకట్టారు. సుమారు 50 వేల మంది యాత్రికులు వచ్చారని ఆలయాధికారి నల్లూరి సతీష్ కుమార్ తెలిపారు. శుక్రవారం రాత్రి 11 గంటలకు ప్రధాన ఆలయ అర్చకులు తోలేటి అరుణ భాస్కరరావు చేతులమీదగా ఆలయ ఛైర్మన్ నాగుల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రామలింగేశ్వర స్వామి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. బలివే పురవీధుల్లో ప్రధాన ఆలయం నుంచి తాత గుడి వరకు విద్యుత్ దీపాలం కరణాలతో, డప్పు వాయిద్యాల నడుమ ఆలయాధికారి సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఊరేగింపు నిర్వహించారు.

టిప్పర్లను అడ్డుకున్న రైతులు

పొగాకు బేరన్ పంటలు పాడైపోతున్నాయని ఆవేదన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

టిప్పర్లను అడ్డుకున్న రైతులు

మండలంలోని పేరంపేటలో జరుగుతున్న గ్రీన్ ఫీల్డ్ హైవే పనులకు మట్టిని తరలిస్తున్న టిప్పర్లను రైతులు అడ్డుకున్నారు. రోడ్డు తడపకుండా టిప్పర్లు తిరుగుతుండడంతో రోడ్డు పక్కనే ఉన్న పొగాకు బేరన్ తోటలు పాడైపోతున్నాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మట్టి రోడ్డు కనీసం తడపడంలేదని వాపోయారు. టిప్పర్లు అలాడే తిరుగుతుండడంతో పంటలు పాడైపోతున్నాయన్నారు. ఈ విషయంపై కాంట్రాక్టర్లకు పలుమార్లు చెప్పినా తూతూమంత్రంగా తడిపి వదిలేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిసార్లు చెప్పినా మొర ఆలకించడంలేదని శనివారం రైతులు టిప్పర్లను అడ్డుకున్నారు.

11న రాష్ట్ర రైతాంగ సదస్సు

జయప్రదానికి రైతు కూలి సంఘం పిలుపు

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం (ఎపిఆర్ సిఎస్) ఆధ్వర్యంలో ఈ నెల 11న విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో జరిగే రాష్ట్ర రైతాంగ సదస్సును జయప్రదం చేయాలని ఆ సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి భాస్కర్ పిలుపునిచ్చారు. మండలంలోని మర్రిగూడెం గ్రామంలో రైతాంగ సదస్సు కరపత్రాన్ని సంఘం జిల్లా కార్యదర్శి శనివారం ఆవిష్కరించి, ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోడీ ఫాసిస్ట్, దోపిడీ పాలనలో వ్యవసాయ రంగం సంక్షోభంలోకి వెళ్తుందన్నారు. పంట మద్దతు ధర లేక పెట్టుబడి భారంతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. వ్యవసాయ అనుకూల భూములు వ్యవసాయేతర భూములుగా మారిపోతున్నాయని విమర్శించారు. గిట్టుబాటు ధర చట్టం చేయాలనే న్యాయమైన డిమాండ్లతో ఢిల్లీలో పోరాడుతున్న రైతులపై కాల్పులు జరుపుతూ నిరంకుశంగా దాడులు చేస్తున్నారన్నారు. ఇటీవల హర్యానాకు చెందిన ఒక యువ రైతు పోలీస్ కాల్పుల్లో చనిపోయాడని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ రైతాంగ ఉద్యమానికి సంఘీభావంగా, దేశంలోని రైతులు పడుతున్న సమస్యలపై చర్చించుకుని పోరాడే విధంగా ఈ నెల 11వ తేదీ సోమవారం విజయవాడ ప్రెస్ క్లబ్‌లో రాష్ట్రస్థాయి రైతాంగ సదస్సును ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు రైతులు, రైతు కూలీలు, ప్రజలు ప్రజాస్వామికవాదులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సదస్సులో రైతు కూలి సంఘం రాష్ట్ర కార్యవర్గ ఎన్నిక ఉంటుందని తెలిపారు. మాజీ మంత్రి, సంయుక్త కిసాన్ మోర్చా కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు, హైకోర్టు సీనియర్ న్యాయవాది వైకె ప్రసంగిస్తారని తెలిపారు. అరుణోదయ సాంస్కృతి సమాఖ్య జాతీయ ఛైర్‌పర్సన్ విమలక్క బృందంతో కళారూపాలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిఆర్‌సిఎస్ డివిజన్ నాయకులు కొండబత్తుల బాబూరావు, కె.నవీన్, కామన్ సత్యనారాయణ, నాగేశ్వరరావు, కాటయ్య, ముత్యాలరావు, కనకయ్య పాల్గొన్నారు.

వెంకటమాధవరావు మృతి బాధాకరం

ఎంఎల్ఎ వాసుబాబు నివాళి

ప్రజాశక్తి - భీమడోలు

మండలంలోని గుండుగొలను గ్రామానికి చెందిన ప్రముఖులు వగ్వాల వెంకట మాధవరావు శనివారం మృతి చెందారు. ఆయన జాతీయస్థాయి కబడ్డీ క్రీడాకారుడు. టిడిపి ఆవిర్భావం సందర్భంగా ఆ పార్టీలో చేరిన మాధవరావు అప్పట్లో నూతనంగా ఏర్పడిన భీమడోలు మండల ప్రజా పరిషత్ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన భీమడోలు సమితి ఆవిర్భావం నుంచి సమితుల కాల పరిమితి తీరేంతవరకు భీమడోలు సమితి అధ్యక్షునిగా పనిచేసిన కాంగ్రెస్ పార్టీ ప్రముఖుని ఎన్నికల్లో ఓడించి సంచలనం సృష్టించారు. ఆ తర్వాత కాలంలో టిడిపి భీమడోలు జెడ్‌పిటిసి సభ్యునిగా పని చేశారు. భీమడోలు మార్కెట్ కమిటీ అధ్యక్షునిగా కూడా పని చేశారు. ఆయన హయాంలో తన పదవి పరిధిలోని ప్రతి ఒక్కరికీ తన వంతు సహాయ సహకారాలు అందించిన ఘనత ఉంది. వృద్ధాప్యం కారణంగా కొంతకాలంగా రాజకీయాలకు దూరంగా ఉన్నారు. ఇటీవల మాధవరావు దంపతులు తమ వివాహ షష్టిపూర్తి కార్యక్రమాన్ని కుటుంబ సభ్యులు, అభిమానుల మధ్య గుండుగొలనులోని నివాస గృహంలో ఘనంగా నిర్వహించుకున్నారు. మాధవరావు అంత్యక్రియలు ఆదివారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతదేహాన్ని ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు, ఇతర ప్రముఖులు సందర్శించి నివాళు లర్పించారు.


మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ వాసుబాబు

దస్తావేజు పోయినది

గణపవరం మండలం, గణపవరం గ్రామమునకు చెందిన చిన్న రామచంద్రపురంలో నాకు షేక్ ఆలీ సాహెబ్ గారి కుమారుడు షేక్ పీర్ బాష అను నాకు గణపవరం గ్రామం చిన్న రామచంద్రపురంలో (ఎస్ఆర్ఓ గణపవరంలో) **దాక్యుమెంటు నెంబరు 279/1999** లో సర్వే నెబర్ 62/2 లో 35.5 చదరపు గజాలు ఖాళీ స్థలం గల దస్తావేజులు గణపవరం సెంటర్‌లో జిరాక్స్ తీయించుకుని ఇంటికి తీసుకుని వచ్చే మార్గ మధ్యలో ఒరిజినల్ దస్తావేజులు ఉన్న కవర్‌తో సహా పడిపోయినవి. ఎంత వెతికిన దొరకలేదు. కాబట్టి ఎవరికైనా దొరికిన వారు ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

షేక్ పీర్ బాష
తండ్రి: షేక్ ఆలీ సాహెబ్
గణపవరం గ్రామం, చిన్న రామచంద్రపురం
గణపవరం మండలం, పశ్చిమగోదావరి జిల్లా
సెల్: 9701108145

BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHIT'S AT NARASARAOPET.
Dispute No.121/2023
Between:-
M/S LAKSHMI TULASI CHIT FUND PVT LTD. NARASARAOPET, REP BY ITS FORE MAN/BRANCH MANAGER.
... Petitioner/Disputant
AND
Gurindapalli Jayaraju, And Others
.... Respondents/Opponents.
To,
Respondents/Opponents No.
2) Mallampalli siva Rama Prasad (age58y) S/o Venkat Ratnam,Occ: S.A,D.No:23A-6-40/2, Shankara Matam, R.R.Peta, Eluru, West Godavari-534001.
పై నెంబర్ పిటిషన్ నందు 2 వ రెస్పాండెంట్ అయిన మీకు పై పిటిషన్ లో శ్రీ కోర్టు వారి ద్వారా పలుమార్లు నోటీసులు పంపిననూ మీరు తీసుకోనం దున ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయడమైనది ఏమనగా పై పిటిషన్ లో మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న ఎడల ది.16-03-2024 న ఉదయం 10:30 గం.ని లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా కానీ లేదా మీ వకీలు ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.
శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు మేరకు.
P.Chakrapani,
Advocate for Petitioner/Disputant
NARASARAOPET.

BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHIT'S AT NARASARAOPET.
Dispute No.111/2023
Between:-
M/S LAKSHMI TULASI CHIT FUND PVT LTD. NARASARAOPET, REP BY ITS FORE MAN/BRANCH MANAGER.
... Petitioner/Disputant
AND
Kondapalli Naga Venkata Aliya & Others
.... Respondents/Opponents.
To,
Respondents/Opponents No.
2) Mallampalli Siva Rama Prasad (age 58y) S/o Venkata Ratnam, Occ: School Assistant,D.No:23a-6-40/2,Shankara Matam,R.R.Pet,Eluru, West Godavari- 534001.
పై నెంబర్ పిటిషన్ నందు 2 వ రెస్పాండెంట్ అయిన మీకు పై పిటిషన్ లో శ్రీ కోర్టు వారి ద్వారా పలుమార్లు నోటీసులు పంపిననూ మీరు తీసుకోనం దున ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయడ మైనది ఏమనగా పై పిటిషన్ లో మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న ఎడల ది.16-03-2024 న ఉదయం 10:30 గం.ని లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా కానీ లేదా మీ వకీలు ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.
శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు మేరకు.
P.Chakrapani,
Advocate for Petitioner/Disputant
NARASARAOPET.

In the Court of the Ist Addl. District Judge, Eluru
E.P. No. 7/2019 in O.S. No. 81/2013
Between:
Kuchipudi Phani Kumar
...Plaintif/D.Hr
AND
Pamarthi Jagadeesh
...Respondent/ J.Dr.
JDr: Pamarthi Jagadeesh, S/o. Govardhana Rao, Proprietor, Bommarillu Print Bazar, D.No. 28A-7-10, Rangam Palace Street, Ramachandrarao Peta, Eluru 537002, W.G.Dist.,
ప్రకటన
పై నెంబరు E.P. గ్రంధములో J.Dr. అయిన మీకు ఎన్నిసార్లు సమన్లు పంపినప్పటికినీ అమలు జరుగనందున శ్రీ కోర్టు వారు పేపరు పబ్లికేషన్ ఆర్డరు వేసియున్నారు. పై నెంబరు గ్రంధము **ది. 28-03-2024వ తేదీకి వాయిదా అయివున్నది.** కావున సదరు తేదీన మీరు **ఉదయం గం॥ 10.30 ని॥లకు** శ్రీ కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, లేక మీ యొక్క ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనిచో సదరు గ్రంధము మీ యొక్క పరోక్షములో తీర్మానింపబడును.
B.V.KRISHNA REDDY, Advocate
Eluru, Cell: 9848689999

నోటీసు
మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P. 51/2023 in O.S. 25/2011
బిట్వీన్:
బండి ఆదిత్యప్రసాద్
-పిటీషనరు/వాది/డి. హెచ్. ఆర్.
మరియు
సత్తి సత్యవతి అండ్ అదర్స్
-రెస్పాండెంట్లు/ప్రతివాదులు/ జె.డి.ఆర్స్
టు:
3వ రెస్పాండెంటు/జె.డి.ఆర్:
గుడిమెట్ల రాజేశ్వరి, W/o. సత్యనారాయణ రెడ్డి, డో.నెం. 9-168, పెంటపాడు, పెంటపాడు మండలం, ప॥గో॥జిల్లా, TPG PJCJ.
పై నంబరు గల గ్రంధములో కోర్టు వారిచే పలుమార్లు మీకు నోటీసులు U/O 21, R 22 CPC ప్రకారము పంపించినప్పటికీ మీరు ఉద్దేశ్య పూర్వకముగా తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారము మీకు యిందుమూలముగా నోటీసు జారీ చేయడమైనది. **ది. 03-4-2024 ఉదయం 10.30 గం॥లు** లగాయితు పై కోర్టు వారి సమక్షములో స్వయముగా గాని, అడ్వకేటు గారి ద్వారా గాని హాజరయి మీ సంజాయిషీ తెలుపుకొనవలెనని, లేనియెడల మీ పరోక్షమున కోర్టు వారిచే తీర్మానము చేయబడును.
తోట వెంకట సత్యనారాయణ
వడ్లాని తేజ
తాడేపల్లిగూడెం అడ్వకేట్స్, తాడేపల్లిగూడెం
ది. 9-3-2024 సెల్: 9948243686